సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 23 । నవంబర్ । 2023



సిరిసిల్లలో ఫ్లాగ్‌మార్చ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.



స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

వేములవాడ: స్థానిక తహసీల్దార్ ఆఫీస్‌లోని పోస్టల్ బ్యాలట్ స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/22.0

వాతావరణం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇంటి వద్దే ఓటుహక్కు



దేశాయిపల్లిలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

బోయినపల్లి(వేములవాడ): మండలంలోని అనంతపల్లి, గుండన్నపల్లి, రత్నంపేట, కోరెం, దేశాయిపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో పూర్తిగా లేవలేని పరిస్థితిలో ఉన్న 14 మంది దివ్యాంగులు బుధవారం ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆయా గ్రామాలకెళ్లినా మోడల్‌కోడ్ టీమ్ సభ్యులు పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి దివ్యాంగులు పకడ్బందీగా ఓటుహక్కులు వినియోగించుకునేలా చేశారు. మండలంలో మొత్తం 23 మందిని హోమ్ ఓటింగ్‌కు అనుమతినిచ్చారు. ఇందులో 14 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్‌ఐ బాలయ్య తెలిపారు. హోమ్ ఓటింగ్‌లో పీవో జీపీ రాజేంద్రప్రసాద్, ఏపీవో బి.గంగారాం, ఎంసీసీ టీమ్ సభ్యులు అజయ్‌రెడ్డి, ఆర్‌ఐ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం, మర్రిపల్లి, బొల్లారం, హన్మాజీపేట గ్రామాల్లోని వయోవృద్ధులు ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇలా నమోదు చేసిన ఓట్లను కౌంటింగ్ తేదీ వరకు భద్రపరచనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ రోజున తీసి లెక్కింపు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆలయ అర్చకుడిపై ఈవోకు ఫిర్యాదు

వేములవాడ: భక్తుల మనోభావాలు దెబ్బతినేలా అర్చకుడు మాట్లాడారని వేములవాడకు చెందిన బీసీ మోర్చా అధ్యక్షుడు నామాల శేఖర్ ఈవో కృష్ణప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. భక్తులు అంటే గౌరవం ఇవ్వని, ఆలయ ప్రతిష్ఠతకు భంగం కలిగించేలా ప్రవర్తించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సాంకేతిక లోపం.. సామాన్యులకు శాపం



ఇతని పేరు హన్మాండ్లు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట. హన్మాండ్లు, అతని భార్య నాగలక్ష్మి బుధవారం సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వచ్చారు. ముందురోజే స్టాంప్ డ్యూటీ, మ్యుటేషన్ చార్జీలు ఆన్‌లైన్‌లో చెల్లించారు. కోళ్ల మద్దిలోని 150 గజాల ప్లాటును అమ్మేసి రిజిస్ట్రేషన్ చేయించేందుకు 30 కిలోమీటర్ల దూరం నుంచి సిరిసిల్లకు వచ్చారు. ఉదయం 10.40 గంటలకే రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు చేరుకోగా.. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో ఇలా సెల్‌ఫోన్ చూస్తూ.. కాలక్షేపం చేస్తున్నాడు.



ఇది సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లోని స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్ల వ్యవహారాలు నడిపే కంప్యూటర్. క్రయ, విక్రయదారుల వేలిముద్రలు, ఫొటోలు, సాక్షుల వేలిముద్రలు, ఫొటోలు తీసే ఈ కంప్యూటర్ పాడైంది. ఇదే ఆఫీస్‌లో ఉండే మరో కంప్యూటర్ సైతం పనిచేయడం లేదు. ఇక్కడి ఆఫీస్‌లోని ప్రింటర్, ఐరిష్ నమోదు పరికరం ఒక్కటి కూడా పనిచేయడం లేదు. ఫలితంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

- పనిచేయని రిజిస్ట్రేషన్‌శాఖ కంప్యూటర్లు
- అందుబాటులో లేని టెక్నీషియన్
- సెలవులో సబ్‌రిజిస్ట్రార్
- సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- ఇక్కడ తరచూ ఇదే సమస్య
- ఇబ్బందిపడుతున్న క్రయ, విక్రయదారులు



సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ భవనం



వీళ్లంతా సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో బుధవారం రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు. సిరిసిల్ల రెవెన్యూ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలు, సిరిసిల్లకు చెందిన వారు రిజిస్ట్రేషన్ కోసం రాగా.. కంప్యూటర్లకు సాంకేతిక సమస్యల రావడంతో ఇలా ఆఫీస్‌లోని కుర్చీల్లో కూర్చున్నారు. గంటలు గడిచే కొద్ది చేసేదేమి లేక ఇక్కడే ఎదిరిచూశారు.

సిరిసిల్ల: సిరిసిల్లలోని సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో తరచూ టెక్నికల్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలను పరిష్కరించే టెక్నీషియన్ కరీంనగర్‌లో ఉంటారు. బుధవారం ఆఫీస్‌లోని ఏ ఒక్క కంప్యూటర్ కూడా పనిచేయకపోవడంతో టెక్నీషియన్‌కు సిబ్బంది ఫోన్ చేయగా అందుబాటులో లేరు. చాలా సేపటికి అందుబాటులోకి వచ్చినా సాంకేతిక సమస్యను గుర్తించడంలో జాప్యమైంది. కంప్యూటర్‌ను ఓపెన్ చేసి అందులోని దుమ్మును అందరి ముందే మిషన్ సాయంతో దులిపారు. రెండు కంప్యూటర్లు పనిచేయకపోవడంతో సిస్టమ్‌ను రీస్టార్ట్ చేశారు. అయినా అవి మొరాయించాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు.. గంటలకొద్దీ పడిగాపులు కాశారు. సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్నా శాశ్వతంగా పరిష్కార చర్యలు తీసుకోవడం లేదు.

సెలవులో సబ్‌రిజిస్ట్రార్

సిరిసిల్లలో పనిచేసే సబ్‌రిజిస్ట్రార్ పార్థసారధి సెలవులో ఉన్నారు. ఆఫీస్‌లోని రికార్డులు చూసే జూనియర్ అసిస్టెంట్ సదాశివ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కంప్యూటర్లు పనిచేయకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ సీట్లో కూర్చున్న ఆయన కాలక్షేపం చేస్తూ కనిపించారు. కంప్యూటర్లకు సంబంధించిన సైట్ లైసెన్స్ రెన్యూవల్ కాకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని, అవి ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయని ఇలాంటి సాంకేతిక సమస్యలు సాధారణమేనని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సదాశివ్ సెలవిచ్చారు. ఏది ఏమైన కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేసే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఆఫీస్‌లో ఇలా కాలం చెల్లిన కంప్యూటర్లు ఉండడం, అవి తరచూ మొరాయించడంతో సామన్యులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం భోజనం విరామం తర్వాత అవే కంప్యూటర్లు పనిచేయడంతో కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి జిల్లా కేంద్రమైన సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు కొత్త కంప్యూటర్లను అందించాలని, సాంకేతిక సమస్యలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం

- 25 వరకు హోమ్ ఓటింగ్ పూర్తి చేస్తాం
- ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఓటరు గుర్తింపుకార్డుల పంపిణీ, బ్యాలట్‌పత్రాల ముద్రణ, ఈవీఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటుపై వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 70 శాతం మంది ఓటర్లకు సమాచార స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలిన వారికి గడువులోగా అందిస్తామన్నారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రెండు బ్యాలట్‌యూనిట్లను వినియోగిస్తున్నామని, రెండో బ్యాలట్ యూనిట్ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని, ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ ఈనెల 24లోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో హోమ్ ఓటింగ్ సేకరణ ప్రారంభమైందని, ఈనెల 25లోగా పూర్తి చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ నాయకులు నిర్వహించే సమావేశాలకు అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి జితేంద్రప్రసాద్, జిల్లా కార్మిక అధికారి రఫీ, చేనేత జౌళి అధికారి సాగర్, అదనపు డీఆర్డీవో మదన్‌మోహన్, కలెక్టరేట్ ఏవో రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఎలాంటి పార్టీలకు, అభ్యర్థులకు అనుబంధంగా ఉండకూడదన్నారు. అంతకుముందు కలెక్టర్ సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో హోమ్‌ఓటింగ్ విధానం, ఇళ్ల వద్దకు వెళ్లి రహస్య బ్యాలెట్ ద్వారా వారి ఓటును వేయించి సీల్డ్ కవర్‌లో సేకరించడం, స్ట్రాంగ్‌రూంలలో భద్రపరచడం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సీపీవో పీబీ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- ఉల్లంఘనులపై కఠినంగా వ్యవహరించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగాలంటే సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమలు నుంచి నేటి వరకు నమోదైన కేసులు, పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ రోజు, తర్వాత, కౌటింగ్ రోజు ఉండే విధుల నిర్వహణపై వివరించారు. ఎన్నికల నియమాలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్టంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధానాలను అరికట్టేందుకు ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నగదు, ఉచితాలు ఇచ్చే వారిపై నిఘా పెట్టాలన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్ ఉన్నారు.

కేటీఆర్ ఫోన్‌కాల్ లీక్

- ఆడియో షేర్ చేసిన కాంగ్రెస్



కేటీఆర్

సిరిసిల్ల: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఆయా రాజకీయపార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఓ వైపు ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేస్తూనే.. ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఈక్రమంలోనే మంత్రి కేటీఆర్ ఫోన్‌కాల్ లీక్ అ యిందంటూ కాంగ్రెస్ ఓ ఆడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయడం వైరల్‌గా మారింది. సిరి సిల్లలో ప్రచారానికి పోవడానికి క్యాడర్ వెనకాడుతుందని.. ఫోన్లు చేసి బతిమాలుకునే పరిస్థితి బీఆర్‌ఎస్‌కు వచ్చిందని విమర్శిస్తూ.. కేటీఆర్ వాయిస్‌తో ఉన్న ఆడియోను పోస్టు చేసింది. ఈ ఆడియోలో.. వారం రోజుల్లో ప్రచారం ముగిస్తుందని.. ఈ కొన్ని రోజులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ సూచించినట్లు తెలుస్తోంది. ఎవరి మాటలు పట్టించుకోకుండా కౌన్సిలర్లు.. సర్పంచులు కలిసి పనిచేయాలని కోరారు. సొంత పార్టీ నేతలు పదిమంది పది రకాలుగా మాట్లాడడం బంద్ చేయాలని హెచ్చరించారు. మెజార్టీ తగ్గుతుందని మనోళ్లే ప్రచారం చేస్తున్నారని.. మనల్ని మనమే తగ్గించుకోవద్దని నాయకులకు క్లాస్ తీసుకున్నారు. రాష్ట్రం మొత్తం సిరిసిల్ల వైపు చూస్తోందని, ఈవారం రోజులు ఏ ఊరి వాళ్లు ఆ ఊరిలో, ఏ బూత్‌వాళ్లు ఆ పరిధిలో పటిష్టంగా ఇంటింటా ప్రచారం చేయాలని సూచిస్తున్నట్లు వినిపిస్తుంది. గతంలో మాదిరిగా కాకుండా వచ్చే ఎన్నికల తర్వాత వారంలో కనీసంగా రెండు రోజులు సిరిసిల్లకు వచ్చి అందుబాటులో ఉంటానని చెబుతున్నారు. కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు ఇస్తామంటూ చెప్పాలని.. మీకేమైనా సమస్యలుంటే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పండంటూ పేర్కొన్నారు.

రూ.3.13 లక్షలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్

సిరిసిల్లక్రైం/వేములవాడరూరల్: ఎన్నికల కోడ్ అతిక్రమించి నగదు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.1.84 లక్షలను బుధవారం పట్టుకున్నట్లు సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. వాహన తనిఖీల్లో రూ.1.29లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై ఎస్సై మారుతి తెలిపారు. ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో సీజ్‌చేసి, అధికారులకు అప్పగించారు.

ఈటల వర్గం.. ఆగమాగం!



- రెండుచోట్లా గెలిస్తే హుజూరాబాద్‌కు రాజేందర్ రాజీనామా?
- ఆ తర్వాత తమ భవితవ్యమేంటని లీడర్ల ఆందోళన
- తుల ఉమ తరహాలో పట్టించుకోరేమోనని సందేహం
- ఇప్పటికే ఎంపీ సంజయ్, గంగాడి వర్గాలతో పెరిగిన దూరం

జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వర్గాన్ని ఓ ఆందోళన వెంటాడుతోంది. ఇటు హుజూరాబాద్, అటు గజ్వేల్‌లో పోటీ చేస్తున్న ఆయన రెండుచోట్లా గెలిస్తే.. హుజూరాబాద్‌కు రాజీనామా తప్పదన్న ప్రచారమే ఇందుకు కారణం. వాస్తవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగిన బీసీ నాయకుడు ఈటల రాజేందర్. తన అనుచరుల్లో ఈ రకపు ఆందోళనలు పెరిగేందుకు ఆయన వ్యవహారశైలి, రాజకీయ ఒడిదుడుకులే కారణమవుతున్నాయి.

వాడుకొని వదిలేస్తారా?


ఇదే సమయంలో.. ఈటల రాజేందర్ మనుషులను వాడుకొని వదిలేస్తారన్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ముమ్మరం చేశాయి. గతంలో సీఎం కేసీఆర్ సాయంతో తిరుగులేని నేతగా ఎదిగిన ఆయన, ఆ తర్వాత బీజేపీలో ఎంపీ బండి సంజయ్ సాయంతో గెలిచాడంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలతో కేసీఆర్‌కు, హుజూరాబాద్ ఉప ఎన్నిక తర్వాత బండి సంజయ్‌కు వెన్నుపోటు పొడిచారని చెబుతున్నాయి. తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంపీ సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి ఈటల రాజేందరే కారణమని పేర్కొంటున్నాయి. ఆయనను నమ్ముకొని, బీజేపీలోకి వచ్చిన తుల ఉమకు పార్టీ టికెట్ ఇప్పించడంలోనూ విఫలమయ్యారని ఆమె అనుచరులు అంటున్నారు. ఆయన కేసీఆర్, సంజయ్‌ని వాడుకున్నట్లే.. తమనూ వాడుకొని, వదిలేశారని మండిపడుతున్నారు.

కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌తో గట్టి పోటీ..

గతంలో ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో ఏ ఒక్కరినీ బీఆర్‌ఎస్ నుంచి ఎదగనీయలేదని, అందుకే ఇంతకాలం గెలుస్తూ వచ్చాడని పలువురు అంటున్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి 2018లో ఆయనకు చెమటలు పట్టించారు. ప్రస్తుతం పాడితోపాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు అన్న మనవడు వొడితెల ప్రణవ్(కాంగ్రెస్) కూడా బరిలో ఉన్నారు. ఈ ఇద్దరూ అంగబలం, అర్థబలం దండిగా ఉన్న నేతలు. వీరిని ఢీకొట్టాలంటే వాస్తవానికి ఎంపీ బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిల సాయం తప్పనిసరి. కానీ, వీరిద్దరితో ఈటలకు పొసగడం లేదన్న ఆరోపణలున్నాయి. వారు ఎక్కడా ఆయన ప్రచారంలో కనిపించకపోవడం గమనార్హం.

రాజ్‌నాథ్ ఎదుట కాంగ్రెస్‌పై ప్రశంసలా?

ఇటీవల జమ్మికుంటలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో నిర్వహించిన సభలోనూ ఎంపీ సంజయ్ పాల్గొనలేదు. ఎక్కడా ఆయన ప్రస్తావన లేకపోయేసరికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అదే వేదికపై ఈటల రాజేందర్ కాంగ్రెస్ నేతలపై ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు యాదవ్, ఆయన సోదరులు తన గెలుపు కోసం పని చేశారని కీర్తించారు. ఈ మాటలకు వేదిక కింద ఉన్న బీజేపీ నాయకులు అవాక్కయ్యారు. తన కోసం ప్రచారం చేసిన ఎంపీ సంజయ్ పేరు ఎందుకు ఉచ్చరించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తన గెలుపు కోసం పని చేసిందని చెప్పి, బీజేపీ విజయాన్ని పలుచన చేశారని మండిపడుతున్నారు. ఏ వేదిక ఎక్కినా.. వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తున్నారు తప్ప.. బీజేపీ సిద్ధాంతాలను, దేశభక్తి, ప్రధాని మోదీ, భారత్ మాతా, అద్వానీ, వాజ్‌పేయి అన్న పదాలు పలికేందుకు ఆయనకు మనసు రావడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలో తన కీలక అనుచరులుగా పేరొందిన వారంతా కాంగ్రెస్‌లో చేరడం చర్చకు దారితీసింది.



గెలిస్తే 6 నెలల్లో రాజీనామా

ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నేత. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నాయకుడు కావడం విశేషం. శాసనసభా పక్ష నేతగా, మంత్రిగా తన నియోజకవర్గాన్ని బాగానే అభివృద్ధి చేసుకున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల ఏర్పాటు, హుజూరాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితరాలతో ఆయన స్థానికుల మనసు గెలుచుకున్నారు. 2021లో అనూహ్యంగా బీఆర్‌ఎస్ వీడి, బీజేపీ నుంచి ఉపఎన్నికలో విజయం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన తన స్థానంతోపాటు సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనూ పోటీ చేస్తున్నారు. రెండుచోట్లా గెలిస్తే 6 నెలల్లో ఏదో ఒక స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం. సీఎంపై గెలిచాక ఆ రికార్డును కాపాడుకునేందుకు అక్కడే ఉంటారు కానీ, అక్కడ రాజీనామా చేసి, హుజూరాబాద్‌కు ఎందుకు వస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది. అలాంటప్పుడు రాజేందర్‌ను గెలిపిస్తే.. తమ భవితవ్యం ఏంటన్న ఆలోచన ఆయన కేడర్‌లో నిరుత్సాహం నింపుతోంది.

వేములవాడ రూపురేఖలు మారుస్తా

- యువతకు ఉపాధి కల్పిస్తా
- బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడ: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతానని బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నా రు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఇప్పటికే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుల కృషితో నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తోందని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి వేములవాడ రూపురేఖలను మార్చుతానని పేర్కొన్నారు.

సాక్షి: రాజన్నగుడి అభివృద్ధిని ఎలా చేపడతారు ?

చల్మెడ: రాష్ట్రంలోనే ప్రముఖ శివాలయమైన రాజన్న గుడి ఇక్కడే ఉంది. దక్షిణకాశీగా పేరొందిన రాజన్న క్షేత్రాన్ని కాశీ క్షేత్రంగా మారుస్తాం. యాదాద్రి తరహాలోనే రాజన్న ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే రూ.వెయ్యి కోట్ల ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచాం. 35 ఎకరాల భూమి సేకరించి పెట్టాం. వీటీడీఏ, శృంగేరి పీఠాధిపతుల అనుమతులు అందడంతోనే అభివృద్ధి పనులు మొదలవుతాయి. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూనే వారికి ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాట్లు చేయబోతున్నాం.

సాక్షి: ఆలయం, పట్టణం కలిసే ఉన్నాయి కదా.. ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు?

చల్మెడ : మిగతా ఆలయాల కంటే వేములవాడ ఆలయానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. రాజన్న గుడి, పట్టణం కలిసే ఉంటాయి. ఆలయాన్ని అభివృద్ధి చేస్తూనే సుందరంగా తీర్చిదిద్దుతాం. రోడ్లు విస్తరిస్తాం. అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మిస్తాం. సెంట్రల్‌లైటింగ్‌తో పట్టణ రూపరేఖలు మార్చేస్తాం. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం.

సాక్షి: విద్యకు ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?

చల్మెడ: విద్యతోనే సామాజికాభివృద్ధి సాధించవచ్చు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతాం. మహిళా జూనియర్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తాం. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యపై కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది.

సాక్షి: యువత, ముంపు గ్రామాలకు ఎలాంటి ఉపాధి చూపిస్తారు?

చల్మెడ: యువత, ముంపు గ్రామాల ప్రజల కోసం పరిశ్రమలు, ఐటీపార్క్ తీసుకొస్తాం. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తాం.

సాక్షి: ఇది వ్యవసాయ ఆధారిత ప్రాంతం. రైతులను ఎలా ఆదుకుంటారు?

చల్మెడ: ఇప్పటికే ప్రాజెక్టులు నిర్మించి, సాగునీరు అందిస్తున్నాం. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రానున్న రోజుల్లో మల్కపేట, కలికోట సూరమ్మ ప్రాజెక్టులు పూర్తి చేయబోతున్నాం. ఇప్పటికే రైతులకు ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. రైతుబంధు అమలు చేస్తున్నాం. పండించిన ప్రతీ గింజను కొంటున్నాం.

సాక్షి: వేములవాడను ఎలా అభివృద్ధి చేస్తారు?

చల్మెడ : మాది ముందునుంచి రాజకీయ కుటుంబం. మా నాన్న మంత్రిగా పనిచేశారు. ఆర్థికంగా స్థిరపడి ఉన్నాం. వైద్యసేవలో కొనసాగుతున్నాం. ఇది జన్మనిచ్చిన ప్రాంతం కాబట్టి ఈ గడ్డ రుణం తీర్చుకునేందుకు, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజలు ఆశీర్వదించి నన్ను అసెంబ్లీకి పంపిస్తే వేములవాడ రూపురేఖలు మార్చేస్తాను.

సాక్షి: మీ గెలుపు కోసం దోహదపడే అంశాలేమిటి ?

చల్మెడ: అరవై ఏండ్లలో చేయలేని అభివృద్ధి కేవలం పదేళ్లలో చేసి చూపింది కేసీఆర్ ప్రభుత్వం. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలంటూ రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు, కులసంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు, మేధావులు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో నాకు ఓటేసి తప్పకుండా భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆశిస్తున్నా.

క్లుప్తంగా

హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం



సిరిసిల్లక్రైం: సుదీర్ఘకాలం పోలీస్‌శాఖలో పనిచేసి బుధవారం పదవీ విరమణ చేసిన హోంగార్డు బి.వెంకటేశంకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన వెంకటేశం దంపతులను శాలువాతో సత్కరించి వెల్ఫేర్ ఫండ్ నుంచి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10 వేల చెక్కును అందించారు. 33 ఏళ్లపాటు పనిచేసిన తీరును మరువలేమని, కుటుంబ అవసరాలకు తమ సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆర్‌ఐలు రమేశ్, మధుకర్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం చేయిస్తున్న వ్యక్తిపై కేసు

వేములవాడ: ఇతర రాష్ట్రానికి చెందిన యువతితో వ్యభిచారం చేయిస్తున్న కంసాని శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో ఇతర రాష్ట్రానికి చెందిన యువతికి పని ఇస్తానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లి బంధించి వ్యభిచారం చేయించారని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లిరూరల్: తాటిచెట్టుపై నుంచి జారి పడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి మల్లేష్ అనే గీత కార్మికుడు బుధవారం తాటిచెట్టు ఎక్కి కిందికి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా కిందికి జారి పడ్డాడు. కింది భాగంలో ఉన్న తాటి మొద్దును గుద్దుకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు, చేతులు, దవడ భాగంలో గాయాలు కాగా.. మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మద్యం పట్టివేత

కథలాపూర్: మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వైపు అక్రమంగా మద్యం తరలిస్తుండగా బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కథలాపూర్‌కు చెందిన అజయ్ రూ.8,200 విలువగల మద్యం తీసుకెళ్తూ కనిపించారు. మద్యం స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోమటి కొండాపూర్‌కు చెందిన రాయేడి గంగారెడ్డి(30) అనే యువకుడు ఉపాధి నిమిత్తం కొంతకాలం క్రితం దుబాయ్ వెళ్లాడు. ఇందుకోసం పలువురి దగ్గర అప్పులు చేశాడు. అక్కడ ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి అప్పులు తీర్చే మార్గం లేక మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 18న ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు మొదట మెట్‌పల్లిలోని ఆసుపత్రికి.. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మరణించాడు. తండ్రి పెద్ద రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విలీనం సమస్యలమయం

- గుంతలుపడ్డ రోడ్లు..
- కనిపించని డ్రెయినేజీలు
- కంపుకొడుతున్న కాలనీలు
- రాత్రయితే వెలగని వీధిదీపాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

వేములవాడఅర్బన్: ధ్వంసమైన రోడ్లు.. కనిపించని డ్రెయినేజీలు.. దుమ్ములేస్తున్న కాలనీలతో వేములవాడ మున్సిపాలిటీలోని విలీన గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టించుకునే వారు లేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు ప్రజలు తమ సమస్యలను అధికారులకు, సర్పంచ్‌కు చెప్పుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు అధికారులు గ్రామాల్లోకి రాకపోవడంతో తమ సమస్యలను పట్టించుకునే వారు లేరని ఆవేదన చెందుతున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో తిప్పాపూర్, నాంపల్లి, కోనాయపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి గ్రామాలను విలీనం చేశారు. ఆయా గ్రామాల్లో కౌన్సిలర్లు ఉన్న సమస్యలు పరిష్కరించడం లేదు. విలీన గ్రామాల్లోని సమస్యలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టు.

నాంపల్లిలో..

- నాంపల్లిలో గురువయ్యనగర్, శివపార్వతులకాలనీ, కాలరామన్నపల్లి, శాంతినగర్, బొజ్జపల్లి, ఇస్లాంనగర్, గొల్లపల్లెలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నెలకు ఒక్కసారి మురికి కాలువలు శుభ్రం చేయడంతో కాలనీలు కంపుకొడుతున్నాయి.
- నాంపల్లి పాఠశాల వద్ద కరీంనగర్–వేములవాడ రహదారి ప్రమాదకరంగా మారింది.
- వేములవాడ– సిరిసిల్ల–కరీంనగర్ మూడు రహదారులు కలిసే ప్రాంతం డేంజర్‌గా ఉంది.
- శ్మశాన వాటిక లేదు.



గుంతలుగా మారిన అయ్యోరుపల్లి రహదారి

- డ్రెయినేజీలు లేక మురికి రోడ్డుపై పారుతుంది.
- చెత్తబండి వారానికొకసారి వస్తుంది

తిప్పాపూర్‌లో

- సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు.
- డ్రెయినేజీలను నెలకోసారి కూడా శుభ్రం చేయడం లేదు.
- నల్లా నీటి పైపులైన్లు లీకేజీతో రోడ్డుపై నీరు పారుతుంది.
- స్థానిక హనుమాన్ గుడి వద్ద సీసీ రోడ్డు గుంతలు పడింది. అక్కడ మట్టిపోయడంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి దుమ్ము లేస్తుంది.
- శ్మశానవాటిక లేకపోవడంతో మూలవాగులో దహన సంస్కారాలు చేస్తున్నారు.

కోనాయపల్లిలో..

- శ్మశానవాటిక లేదు.
- ఇళ్ల మీదుగా వెళ్తున్న కరెంట్ తీగలు ప్రమాదకరంగా మారాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శాత్రాజుపల్లిలో..

- గ్రామంలోని మసీదుకాలనీలో మురికికాలువలు లేవు.



వేములవాడ మున్సిపల్ విలీనం తిప్పాపూర్

- సీసీ రోడ్లు లేవు. విద్యుత్ స్తంభాలు లేక వీధిదీపాలు లేక రాత్రిపూట చిమ్మ చీకటిలోనే ఉంటున్నారు.
- శ్మశానవాటిక నిర్మాణం పూర్తి కాలేదు.
- శాత్రాజుపల్లి–ఎదురుగట్ల దారికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదు.

అయ్యోరుపల్లి..

- వేములవాడ నుంచి అయ్యోరుపల్లికి వెళ్లే దారి గంజీవాగు బ్రిడ్జి నుంచి గ్రామం వరకు రోడ్డు కంకరలేచి ప్రమాదకరంగా మారింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు.
- శ్మశానవాటిక లేదు.

సీసీ రోడ్డు లేదు



శాత్రాజుపల్లిలోని మసీదుకాలనీలో సీసీ రోడ్డు, మురికికాలువలు లేక ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం బురదతో, ఎండకాలం దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం. విద్యుత్ స్తంభాలు లేక రాత్రిపూట చీకట్లోనే ఉంటున్నాం.
– నవీన్, శాత్రాజుపల్లి

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



కోనాయపల్లిలో ఇళ్ల మీద నుంచి విద్యుత్ తీగాలు ప్రమాదకరంగా వెళ్తున్నాయి. ఈదురుగాలులు వీచినప్పుడు భయంగా ఉంటుంది. వీటిని తొలగించి రహదారి పక్కన వేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.
– అంజయ్య, కోనాయపల్లి

ప్రమాదకరంగా రోడ్డు



వేములవాడ నుంచి అయ్యోరుపల్లి వెళ్లే దారి గంజివాగు నుంచి అయ్యోరుపల్లి వరకు కంకర లేచి ప్రమాదకరంగా మారింది. రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వేములవాడకు, పంట చేలల్లోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. రోడ్డును బాగుచేయాలి.
– రాజారాం, అయ్యోరుపల్లి

డ్రెయినేజీలు కంపు కొడుతున్నాయి



తిప్పాపూర్‌కు చెత్తబండి వారానికొకసారి వస్తుంది. మురికికాలువలు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. అధికారులు పట్టించుకుని డ్రెయినేజీలను శుభ్రం చేయించాలి.
– నేరళ్ల హరిణి, తిప్పాపూర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మరో నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన ఎక్కలదేవి మల్లేశం(31) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. హరిదాస్‌నగర్‌కు చెందిన మల్లేశం తన సొంత పని కోసం మంగళవారం సాయంత్రం బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పదిర శివారులోని బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటో బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన ప్యాసింజర్ ఆటోడ్రైవర్ గొట్టం దేవయ్య అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారణమయ్యాడు. పనిమీద బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెంది శవమై ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుని తల్లి ఎల్లమ్మ ఫిర్యాదుతో దేవయ్యపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల) : మండలంలోని జగదాంబ తండాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. పెద్దమ్మ స్టేజీ నుంచి గంభీరావుపేటకు వస్తున్న డీసీఎం వ్యాన్ గంభీరావుపేట నుంచి పెద్దమ్మ స్టేజీ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై వస్తున్న రాజస్థాన్‌కు చెందిన ముగ్గురిలో ఒకరు పింటూసింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పింటూసింగ్ వ్యాపారం నిమిత్తం రాజస్థాన్ నుంచి వచ్చి వేములవాడలో ఉంటున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన రాజస్థాన్ యువకుడు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం నాగయ్యపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వేములవాడ నుంచి సనుగుల గ్రామానికి వెళ్తున్న నర్సయ్య ఎదురుగా వస్తున్న నాగయ్యపల్లి వద్ద మరో బైక్‌ను ఢీకొన్న సంఘటనలో గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





హరిహరసుతనే శరణమయ్యప్ప

ముస్తాబాద్(సిరిసిల్ల): హరిహర సుతనే.. శరమయ్యప్ప.. అంటూ అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు గృహంలో రాజుగురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్దెనిమిది మెట్లను వెలిగించి అయ్యప్పస్వామిని కొలిచారు. స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కార్పొరేటర్, బ్యాంకర్ల వేధింపులు!

- కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- జిల్లాకేంద్రంలో ఘటన

కరీంనగర్‌క్రైం: వెంటాడుతున్న ఆర్థిక సమస్యలు, కార్పొరేటర్, బ్యాంకర్ల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి జిల్లాకేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శాభాష్‌పల్లికి చెందిన నాయిని శ్రీనివాస్‌రెడ్డి(40) కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఓ కేసు విషయంలో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కరీంనగర్ సబ్‌కోర్టుకు హాజరయ్యాడు. అదే సమయంలో వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. కోర్టుసిబ్బంది గమనించి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి స్నేహితులు మరో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు. కోర్టు సిబ్బంది కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా.. కరీంనగర్‌లోని ఓ కార్పొరేటర్‌కు సుమారు రూ.40 లక్షలు, కొంత బంగారం శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చాడని, తిరిగి ఇమ్మని అడిగితే ఇబ్బందులకు గురిచేయడంతోపాటు.. ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వేధించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో వెల్లడించినట్లు తెలిసింది. పోలీసులు ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నారు.



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

ప్రేమజంట ఆత్మహత్య

కోనరావుపేట/తంగళ్లపల్లి: పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ప్రేమికులు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. జిల్లాలోని కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన సామల లక్ష్మీనారాయణ–ఇందిర దంపతులు కొన్నేళ్లుగా సిరిసిల్లలోని టెక్స్‌టైల్‌పార్క్‌లో నివసిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు శ్రీధర్(20) ఉన్నాడు. శ్రీధర్ ఐటీఐ సెకండియర్ చదువున్నాడు. వీరి ఇంటి పక్కనే ఒబులాపూర్‌కు చెందిన చెల్ల రాజు–రేణుక దంపతులు కొంతకాలంగా నివసిస్తున్నారు. వీరి కూతురు సంధ్య(17) ఇంటర్ సెకండియర్ చదువుతుంది. సంధ్య, శ్రీధర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ఇద్దరు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చారు. ఇదిలా ఉండగా సంధ్య కనిపించడం లేదని మంగళవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో యువతి బంధువులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం మామిడిపల్లి–కనగర్తి గ్రామాల మధ్య మూలవాగులో ఇద్దరు మృతిచెంది ఉన్న విషయాన్ని గొర్లకాపరుల ద్వారా గ్రామస్తులకు తెలిసింది. వారి పక్కన గడ్డిమందు డబ్బా పడి ఉండడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నారు. వీరి ఫోన్, బ్యాగ్ వేములవాడలోని సాయిరక్ష దాబా సమీపంలో లభించాయి. సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, కోనరావుపేట, తంగళ్లపల్లి ఎస్సైలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సామల శ్రీధర్ (ఫైల్)



చెల్ల సంధ్య (ఫైల్)


గంభీరావుపేట నుంచి ఎమ్మెల్యేలు..

- ఒకరు మంత్రి కూడా..

గంభీరావుపేట(సిరిసిల్ల): మారుమూల మండలం గంభీరావుపేట నుంచి గతంలో ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అందులో ఒకరు మంత్రి పదవిని కూడా చేపట్టారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకు చెందిన పాటి రాజం అప్పటి నేరెళ్ల ఇప్పటి సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, చిన్ననీటి పారుదలశాఖ మంత్రిగా పనిచేశారు. 1978, 1983, 1989లలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన హయాంలో గంభీరావుపేటలో ప్రభుత్వాస్పత్రి, జూనియర్ కళాశాల, మానేరువాగుపై బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటునందించారు. అదేవిధంగా గంభీరావుపేటకు చెందిన కటకం మృత్యుంజయం 1983లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి సంజయ్ విచార్ మంచ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



పాటి రాజం(ఫైల్)



కటకం మృత్యుంజయం

పల్లెల్లో పంపకాల లొల్లి

- మీటింగులకు, ప్రచారాలకు వస్తే పైసలిస్తామని హామీ
- తీర ఎగబెడుతున్న నాయకులు

రుద్రంగి(వేములవాడ): జిల్లాలోని పలు పల్లెల్లో ఎన్నికల పంచాయితీలు జరుగుతున్నాయి. మీటింగ్‌లకు, ప్రచారాలకు వస్తే డబ్బులిస్తామని తీసుకెళ్తున్న నాయకులు తీర ఖాళీ చేతులతో పంపుతుండడంతో పంచాయితీలు జరుగుతున్నాయి. తమ నాయకుడు వస్తున్నాడని చెప్పి కార్నర్‌మీటింగ్‌లకు, ర్యాలీలకు జనాన్ని తరలిస్తున్న ద్వితీయశ్రేణి ఆ మీటింగ్‌లు ముగియగానే ముఖం చాటేస్తున్నారు. డబ్బులు ఇవ్వకుండా పేర్లు రాసుకొని తర్వాత ఇస్తామంటూ ఖాళీ చేతులతో పంపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు కొన్ని పల్లెల్లో గొడవలకు దారితీస్తున్నాయి.

అసంబద్ధ లెక్కలతోనే..

గ్రామాల్లో ప్రచారానికి తమ పార్టీ అభ్యర్థి వస్తుండడంతో ద్వితీయశ్రేణి నాయకులు క్షేత్రస్థాయి క్యాడర్ సహాయంతో భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. అయితే జనసమీకరణ లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని నాయకులు అనుమానించి డబ్బులు ఇచ్చేందుకు వెనకాడుతున్నట్లు తెలిసింది. మీటింగ్‌లకు, ర్యాలీలకు పది మందిని తీసుకొస్తున్న కార్యకర్తలు ఇరువై, ముప్పై మంది పేర్లు చెబుతుండడం.. తీర ర్యాలీలో అంత మంది కనిపించకపోవడంతో అసలుకే డబ్బులు ఇవ్వడం లేదని తెలిసింది.

అన్ని పార్టీలకు వారే..

మండల కేంద్రాలు, పల్లెల్లో జరిగే కార్నర్‌మీటింగ్‌లు, ర్యాలీలలో పాల్గొనే జనం అన్ని పార్టీలలో కనిపిస్తున్నారు. ఇవ్వాల ఒక పార్టీ కండువా కప్పుకుంటే.. మరుసటి రోజు మరో పార్టీ జెండా పట్టుకొని ప్రచారంలో కనిపిస్తున్నారు. తమ మీటింగ్‌కు ఎంత మంది వస్తున్నారో.. ఎదుటి పార్టీ అభ్యర్థి ర్యాలీలో సైతం అంతే మొత్తంలో జనం కనిపిస్తుండడంతో గెలుపుపై అంచనా వేయలేకపోతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన జాగిరి రాజవ్వకు చెందిన ఇల్లు బుధవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బియ్యం, బట్టలు, వంట సామగ్రితోపాటు రూ.10వేల నగదు కాలిబూడిదయ్యాయి. ఇల్లు కాలుతున్న సమయంలో పక్క గదిలో ఉన్న పక్షవాతంతో బాధపడుతున్న శ్రీనివాస్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బాధితురాలు రాజవ్వ భర్త అనారోగ్యంతో గతంలో మృతిచెందాడు. పక్షవాతంతో మంచంపట్టిన కొడుకు శ్రీనివాస్‌తో కలిసి ఆ ఇంట్లో ఉంటుంది. శ్రీనివాస్‌ను ఇంట్లో ఉంచి ఇంటికి తాళం వేసి కిరాణ వస్తువుల కోసం రాజవ్వ బయటకెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగింది. ఇంట్లో నుంచి మంటలు ఎగిసిపడడంతో చుట్టుపక్కల వారు పోగై మంటలను ఆర్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రాజవ్వ బయట నుంచి వచ్చే సరికి ఇల్లు కాలి బూడిదైంది. భర్త చనిపోయి, కొడుకు పక్షవాతంతో మంచంపట్టడంతో పుట్టెడు దుంఖంతో ఉన్న వారిని విధి పగబట్టింది. నిలువునీడ కోల్పోయిన రాజవ్వ రోడ్డున పడింది. రాజవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సర్వం కోల్పోయి విలపిస్తున్న రాజవ్వ

ఆధిపత్య రాజకీయాలు అంతం చేద్దాం

సిరిసిల్లటౌన్: తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని కేసీఆర్‌కు రెండుసార్లు అధికారం అప్పజెప్పితే ఆధిపత్య రాజకీయాలు చేసి అణగారిన వర్గాలకు అన్యాయం చేశారని తెలంగాణ ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు విమర్శించారు. 'దోపిడీ పాలన అంతం చేద్దాం.. తెలంగాణను రక్షించుకుందాం' అనే పేరుతో ముద్రించిన కరపత్రాలను వేదిక రాష్ట్ర సమన్వయకర్త సాయి నరేందర్, సామాజిక తెలంగాణ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ వెన్నపూజ పర్శరాజ్ బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించి మాట్లాడారు. అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా సీఎం అయిన కేసీఆర్‌ను గద్దె దింపే వరకు పోరాటం ఆగబోదన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డిలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఓడించేందుకు నిరుద్యోగులు, ఉద్యమకారులు సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డిలకు తరలివచ్చి విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఇటిక్యాల నర్సయ్య, చొటుపల్లి వేణుగోపాల్, నాగేంద్ర, అనిల్, మారుపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు

నష్టపరిహారం ఇస్తేనే మా ఓట్లు

వీర్నపల్లి(సిరిసిల్ల): మాకు నష్టపరిహారం ఇస్తేనే ఓట్లు వేస్తామని వీర్నపల్లిలోని వెంకట్రాయిని చెరువు ముంపు రైతులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంలోని వెంకట్రాయిని చెరువులో దాదాపు 80 మంది రైతుల పొలాలు ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతన్నాయన్నారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేరన్నారు. పరిహారం చెల్లిస్తేనే ఓట్లు వేస్తామని లేకుంటే ఈ ఎన్నికల్లో ఓట్లు వేయబోమని స్పష్టం చేశారు. మల్లారపు దేవయ్య, తిరుపతి, చంద్రయ్య, పర్శయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లారపు దేవయ్య